క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

రుద్రవరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం వార్షిక తనిఖీలో భాగంగా ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. మట్కా, జూదం, బెల్టుషాపుల నిర్వహణకు దూరంగా ఉండాలని పాత నేరస్తులను హెచ్చరించారు. ఎస్‌ఐ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

వరిలో పంటకోత ప్రయోగం



వరి దిగుబడిని పరిశీలిస్తున్న చీఫ్‌ప్లానింగ్ ఆఫీసర్

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు గ్రామ పరిధిలో మంగళవారం నంద్యాల జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బంది వరిలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 1వ సర్వే నంబర్‌లో రైతు రామబాలిరెడ్డికి సంబంధించిన పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నిర్ణీత కొలతల ప్రకారం ప్రయోగం నిర్వహించగా 17.76 కిలోల ధాన్యం వచ్చిందన్నారు. అలాగే మండలంలోని 19 రెవెన్యూ గ్రామాల్లో వరిలో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ లక్ష్మి, వీఏఏ నవీన్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కరాటేలో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే సంఘం ఆధ్వర్యంలో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు పతకాలు సాధించినట్లు కరాటే సంఘం నంద్యాల జిల్లా జితకునేడో కరాటే సంఘం అధ్యక్షుడు రవికృష్ణ, మాస్టర్లు బాలకృష్ణ, నవీన్‌లు మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరాటే పోటీల్లో విద్యార్థులు హరిప్రియ, వేణుకుమార్ వెండి పతకాలు, జయవర్ధన్, రామసాయి కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదర్శంగా క్రీడామైదానం



రుద్రవరం మోడల్ స్కూల్ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఈ నాగభూషణం రెడ్డి

రుద్రవరం: స్థానిక మోడల్ స్కూల్ క్రీడా మైదానం ఆదర్శంగా నిలుస్తోందని డిప్యూటీ ఈఈ నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆదర్శ పాఠశాల ఆవరణలోని కబడ్డీ, వాలీబాల్ కోర్టు, క్రీడామైదానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మైదానంలో క్రీడలు నిర్వహించేందుకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఉండేవన్నారు. ప్రస్తుతం కొలతల ప్రకారం మైదానాన్ని సౌకర్యవంతంగా తీర్చిదిద్దడంతో ఈ ఏడాది 20మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఏఈ శంకర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి కార్తీక మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళికాంబ మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలచే పూలంగి సేవ నిర్వహించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం అనంతరం 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మినారాయణ, భక్తులు పాల్గొన్నారు.

జామను నమిలేస్తున్న తెగుళ్లు

- వేరు కుళ్లు, పండు ఈగ తెగులుతో తీవ్ర నష్టం
- సుమారు 20 ఎకరాల్లో తోటలను తొలగించిన రైతులు
- మండలంలో 100 ఎకరాలకు పైగా జామ సాగు



ముత్యాలపాడు గ్రామంలో పండు ఈగ తెగులు సోకి రాలిపోతున్న జామకాయలు,



తెగులు నివారణకు చెట్లుకు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డబ్బా

చాగలమర్రి: సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలను చవిచూసిన రైతులు విసిగి, వేసారి ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించారు. బొప్పాయి, జామ, మామిడి తదితర తోటల సాగుపై మక్కువ చూపుతున్నారు. ఈ కోవలో మండలంలోని రైతులు సుమారు 100 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జామను సాగు చేశారు. మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి గ్రామాలలో ఎక్కువగా జామ తోటలు సాగయ్యాయి. ఎకరానికి సుమారు రూ.50 వేల పెట్టుబడి వెచ్చించి జామ తోటల సాగు చేపట్టారు. అయితే దిగుబడి చేతికి అందే సమయానికి రైతుకు నిరాశే మిగిలింది. ముత్యాలపాడు గ్రామానికి చెందిన బావికాడి శ్రీనివాసులు అనే కౌలు రైతు రెండున్నర ఎకరాలకు రూ.50 వేలు కౌలు చెల్లించి జామ తోటను సాగు చేశాడు. తోట సాగుకు ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పెట్టాడు. అయితే తోట దిగుబడికి వచ్చే సమయానికి వేరు కుళ్లు, పండు ఈగ తెగులు సోకడంతో చెట్లు ఎండుముఖం పట్టాయి. కోత దశలో ఉన్న జామ పండ్లు చెట్టు మీదనే మాగి రాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. గత 3 సంవత్సరాల నుంచి పంట సాగులో ప్రత్యేక చర్యలు చేపట్టినా ఫలితం దక్కక్కపోవడంతో తీవ్ర నిరాశలో మునిగిపోయారు.

తోటను తొలగిస్తున్న రైతులు

ఈ ఏడాది ముత్యాలపాడు గ్రామంలో సుమారు 20 ఏకరాల విస్తీర్ణంలో జామ పంటను రైతులు తొలగించారు. రైతులు తుపాకుల పుల్లయ్య–2.50 ఎకరాలు, బోయిన రమణయ్య–ఎకరం, తోటగారి శీను–1.50 ఎకరాలు, మరికొంత మంది ట్రాక్టర్‌తో జామ తోటలను దున్నేసి తొలగించారు. అంతేగాకుండా జామ తోటలు సాగు చేసిన రైతులు బావికాడి శ్రీనివాసులు–2.50 ఎకరాలు, బుగ్గల మాబుసేన్–2 ఎకరాలు, దాదుగాళ్ళ దస్తగిరి–3 ఎకరాలు, మాణ్యం–3 ఎకరాలు, రంపంకోత హుసేన్‌బాష–1.50 ఎకరాలు, జమాల్‌వలి–3 ఎకరాలు, రమేష్–2.80 ఎకరాలు, కోటగారి దస్తగిరి–ఎకరం, కోటగారి వెంకటసుబ్బయ్య– ఎకరం.. తెగుళ్ల నుంచి తోటను కాపాడుకునేందుకు వేలకు వేలు వెచ్చించి క్రిమి సంహారక మందులు పిచికారీ చేశారు, ఫర్టిలైజర్స్ ఎరువులు కూడా చల్లారు. అయినా ఫలితం లేకపోవడంతో తోటలను అలాగే వదిలేశారు. రైతుల పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ సీజన్లలో ఏ దశలో పంట నష్టం వాటిల్లినా వెంటనే ప్రభుత్వ అధికారులు నష్టం అంచనా వేసి పరిహారాన్ని నిర్ణీత సమయంలో రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. ఐతే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా జామ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరు చేయించి ఆదుకోవాలని కోరుతున్నారు.

పండ్లు రాలిపోతున్నాయి



నేను రెండున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని రెండేళ్లుగా జామ పంట సాగు చేస్తున్నాను. ఏటా దిగుబడి చేతికి వచ్చే సమయంలో తోటకు వేరు కుళ్లు, పండు ఈగ తెగులు సోకి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తెగులు తీవ్రతకు జామ కాయలు చెట్టుమీదనే మాగి రాలిపోతున్నాయి. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి. **– బావికాడి శ్రీనివాసులు, కౌలు రైతు, ముత్యాలపాడు గ్రామం**

తోటను దున్నేశాను



సాంప్రదాయ పంటలతో విసిగి వేసారి ఉద్యాన పంటలైన జామ, మామిడి పంటల సాగు చేపట్టగా ఈ ఏడాది తోటల్లో పండు ఈగ, పూతరాలు తెగుళ్లతో తీవ్రంగా నష్టం చవిచూడాల్సి వచ్చింది. జామ తోట తీవ్రంగా దెబ్బతింది. సాగు చేసిన రెండెకరాల జామ తోటను నాలుగు నెలల క్రితం ట్రాక్టర్‌తో దున్ని తొలగించాను.

– రమణయ్య, రైతు, ముత్యాలపాడు

పంచాయతీ పరిపాలనపై అవగాహన



మాట్లాడుతున్న డీపీఓ జమీవుల్లా

బనగానపల్లె రూరల్: గ్రామ పంచాయతీ పరిపాలనపై ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో డోన్ డివిజన్‌లోని ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పరిపాలన, యాప్‌లపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీపీఓ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం స్పందనలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. డోన్ డీఎల్‌పీఓ బాలకృష్ణుడు పీఆర్–యాప్‌తో పాటు గ్రామ పరిపాలనకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.

అవినీతిపై విచారణ జరిపించాలి

నంద్యాల(న్యూటౌన్): చర్చిలో అవినీతికి పాల్పడుతున్న విజయ్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్‌చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని శ్యామ్‌నగర్‌లో ఉన్న ఓ చర్చిలో పెద్ద అని చెప్పుకునే విజయ్ కుమార్ ఫేక్ సొసైటీ ద్వారా అనుమతులు తెచ్చుకొని కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. చర్చిలో ప్రార్థనలకు వచ్చినప్పుడు భక్తులు కానుకలు ఇస్తుంటారని, వాటిని లెక్కలు చెప్పకుండా వాడుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కానుకలకు భద్రత కల్పించాలని కోరారు. లేని పక్షంలో సీపీఐ, ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. పట్టణ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల అవగాహన సదస్సు



మాట్లాడుతున్న తూనికలు కొలతల శాఖ అధికారిణి అనిత

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వినియోగదారుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూనికలు కొలతల శాఖ అధికారిణి అనిత పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు జీవలత అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాషా, అధికారి అనిత మాట్లాడుతూ వర్క్‌షాప్ ద్వారా తూనికలు, కొలతల పరికరాలను తీసుకొచ్చి వాటిలో జరిగే మోసాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్యాకేజీ వస్తువులు కొనేటప్పుడు వాటిపై ఉత్పత్తిదారుడి చిరునామా, మాన్యుఫ్యాక్చరింగ్ డేట్ పరిశీలించాలన్నారు. ఎక్కడైనా మోసాలు జరిగితే తమ శాఖకు తెలియజేయాలన్నారు. ప్రతి వస్తువు కొనేటప్పుడు బిల్లులు తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల సంఘం సభ్యులు రజనీకాంత్, టెక్నీషియన్ శ్రీరాములు, ఉపాధ్యాయులు కెనడి, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమం తనిఖీ



చాగలమర్రి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ జగదీష్ చంద్రారెడ్డి

చాగలమర్రి: మండల కేంద్రంలోని 5వ సచివాలయంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం చాగలమర్రి పీహెచ్‌సీని సందర్శించి వైద్యులు ఇమ్రాన్ నిర్వహిస్తున్న ఓపీ, ఫార్మసీ, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక పీహెచ్‌సీలో పాము, కుక్క కాటుకు సంబంధించి వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అనారోగ్య కారణాల వల్ల వైద్యాధికారిణి అంజలి సెలవుపై వెల్లడంతో చాగలమర్రిలో నిర్వహించే ఎఫ్‌డీపీ కార్యక్రమానికి ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యులు శివమోహన్‌ను నియమించామన్నారు. ఎఫ్‌డీపీ కార్యక్రమం ద్వారా మలేరియా, టైఫాయిడ్, బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేస్తారని చెప్పారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారుల మధ్య కొనసాగుతున్న వివాదం, పరస్పర ఆరోపణలపై విలేకరులు ప్రశ్నించగా.. సమస్యను డీఎంహెచ్‌ఓ త్వరలోనే పరిష్కరిస్తారని చెప్పారు. సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, సీహెచ్‌ఓ రమణమ్మ, ఫార్మసిస్ట్ రాజేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాల పనివేళల పొడిగింపు తగదు



మాట్లాడుతున్న సాంబశివుడు

నంద్యాల(న్యూటౌన్): ఉన్నత పాఠశాలల పని వేళలను మార్పు చేయడం సరికాదని, అలాంటి అసంబద్ధమైన ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో పని వేళలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ పైలెట్ ప్రాజెక్టు కింద ఉత్తర్వులు జారీ చేయడం సరైన విధానం కాదన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు 5 కి.మీ దూరం కాలినడకన, ఆటోల ద్వారా పాఠశాలలకు వస్తున్నారని, విద్యార్థుల భద్రత దృష్ట్యా బడి వేళలు పెంచడం మంచిది కాదన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు పుల్లయ్య, రవి, పవన్‌కుమార్, శేషయ్య పాల్గొన్నారు.

ఆహారంలో కల్తీలుంటే చర్యలు



రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

నంద్యాల(అర్బన్): వినియోగదారులకు అందించే ఆహారంలో కల్తీ ఉంటే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, కాశీంవలి హెచ్చరించారు. వారు మంగళవారం పట్టణంలోని తేజశ్విని, క్లాసిక్, ప్యారడైజ్, యూనిక్, మహరాజ రెస్టారెంట్లలో ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించవద్దన్నారు. రుచుల కోసం టేస్టీ సాల్ట్‌ను వాడరాదనిని, నాణ్యత లేకపోతే శిక్ష తప్పవని హెచ్చరించారు. ఆహార నాణ్యతలో లోపాలు ఉంటే వినియోగదారులు తమ దృష్టికి తేవాలని సూచించారు.

రూ.30.50 లక్షల రుణాలు మంజూరు

ఉయ్యాలవాడ: పొదుపులక్ష్మి గ్రూపులోని సభ్యులకు రూ.30.50 లక్షలు రుణాలు అందజేసినట్లు ఏపీఎం దాస్ మంగళవారం తెలిపారు. డీఆర్‌డీఏ సంస్థ ద్వారా ఇంజేడు, ఉయ్యాలవాడ, నర్సిపల్లె గ్రామాలకు చెందిన గ్రూపుల్లోని సభ్యులకు రూ.11.50 లక్షలు, అలాగే ఉన్నతి పథకం కింద పడిగెపాడు, కొండుపల్లె, నర్సిపల్లె, కాకరవాడ గ్రామాల్లోని పొదుపు గ్రూపులోని సభ్యులకు రూ.19 లక్షల రుణాలు అందజేసినట్లు వివరించారు. వెలుగు సీసీ గంగన్న, వీఓఏలు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

దొర్నిపాడు: విద్యార్థులకు ప్రముఖుల జీవిత చరిత్ర గురించి వివరించాలని గ్రంథాలయాధికారి అఖిలా బేగం సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ఉయ్యాలవాడ: భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథాలయాధికారిణి సంగీతలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో మహిళా సాధికారత కార్యక్రమం పురస్కరించుకుని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

నంద్యాల(అర్బన్): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చింతలయ్య, ఇన్‌చార్జి పుల్లయ్య ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా భారతదేశానికి 18 ఏళ్ల పాటు సేవ చేశారని కొనియాడారు. నాయకులు సలాం, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఆధార్ క్యాంపులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పలు వార్డుల్లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం ఉండి ఆధార్‌కార్డు లేని వారు, ఆధార్‌కార్డులో చేర్పులు, మార్పులు తదితర వాటి సవరణకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని స్కూళ్లు, కాలేజీల్లో ఆధార్ సేవలందిస్తారని వెల్లడించారు. స్థానిక అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులకు శిబిరాల వివరాలు తెలపాలన్నారు.

కాశీ విశ్వనాథుడికి అన్నాభిషేకం



అన్నాభిషేకం అలంకరణలో కాశీ విశ్వనాథుడు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం శివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన కాశీవిశ్వనాథుడికి మంగళవారం శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్వామివారికి పంచామృతాభిషేకాలు, గంధాభిషేకం నిర్వహించి వేదపండితుడు యాదవల్లి కార్తీకేయశర్మ ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం అన్నాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహామంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భగవత్ సేవా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన మేగల వెంకటలక్ష్మమ్మ (45) మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. ఆమె కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటోందని, ఈ క్రమంలో గత 17వ తేదీ రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయిందన్నారు. కుటుంబసభ్యులు ఆమె కోసం గాలిస్తున్న క్రమంలో కేసీ కెనాల్ 16వ లాక్ వద్ద వెంకటలక్ష్మమ్మ మృతదేహం కనిపించినట్లు చెప్పారు. వారి సమాచారం మేరకు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటనపై మృతురాలి భర్త లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్త



కోటకొండలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రుద్రవరం: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులు విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. మండలపరిధిలోని కోటకొండలో గ్రామంలో మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీలో సాగుచేసే పంటల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. వరి, మినుము, మొక్కజొన్న, జొన్న పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ– క్రాప్ చేయించుకోవాలని చెప్పారు. విత్తనాలు కొనుగోలు చేసేప్పుడు సంబంధిత దుకాణం నుంచి పూర్తి వివరాలతో కూడిన బిల్లులు తీసుకోవాలని, వాటిని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఏఈఓ రాజు, సిబ్బంది ఉన్నారు.

ఉర్దూ ఐకాన్ అవార్డు ప్రదానం



డాక్టర్ ఇంతియాజ్ అహమ్మద్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న డాక్టర్ నౌమాన్

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నేషనల్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇంతియాజ్ అహమ్మద్ ఉర్దూ భాషా అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా మంగళవారం ఉర్దూ ఐకాన్ అవార్డును సాహిత్య కమిటీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎస్ఎండీ నౌమాన్, అధ్యక్షుడు అబ్దుల్ సమ్మద్ మాట్లాడుతూ.. ఉర్దూ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అనారోగ్యం రీత్యా అవార్డును అందజేయలేకపోయామన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి ఇంతియాజ్ అహమ్మద్ చేసిన కృషిని ప్రశంసించారు. అబ్దుల్‌అజీజ్, మహమ్మద్ ఫరూక్, కాశీం, నూరుల్లా, చాంద్, నవాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఈఈఎస్ఎల్ ఉపకరణాలతో విద్యుత్ ఆదా



మాట్లాడుతున్న ఎస్ఈ సుధాకర్‌కుమార్

నంద్యాల(అర్బన్): ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఉపకరణాలతో విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చని నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణలో ఈఈఎస్ఎల్ ఉపకరణాల వల్ల విద్యుత్ ఆదాపై మంగళవారం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత, స్వచ్ఛత అత్యధిక వెలుగులు అందించే విద్యుత్ బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, కూలర్లు తదితర వాటిని వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యతను ఉద్యోగులు తీసుకోవాలన్నారు. ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి



ఉయ్యాలవాడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

ఉయ్యాలవాడ: ప్రజలు మరుగుదొడ్డి నిర్మించుకుని, వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం ద్వారా అంటు రోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. మరుగుదొడ్లు లేని వారు నిర్మించుకునేందుకు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ, మండల కో–ఆర్డినేటర్ రమణారెడ్డి, ఏపీఓ రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోస్పాడు: గ్రామాలలో ప్రజలు మరుగుదొడ్లను వినియోగించుకోవాలని, బహిరంగ బహిర్భూమికి స్వస్తి పలకాలని ఈఓఆర్‌డీ నాగ అనసూయ సూచించారు. గోస్పాడులో మంగళవారం జాతీయ టాయిలెట్స్ డే సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలని, బహిరంగ ప్రదేశాలకు బహిర్భూమికి వెళ్లరాదని, అందువల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకొని శుభ్రతను పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా కట్టడికి సహకరించాలి

బొమ్మలసత్రం: అధిక మొత్తంలో బెల్లం, చక్కెర విక్రయించరాదని, 5 కేజీల కంటే ఎక్కువ మొత్తంలో ఎవరైనా కొనుగోలు చేస్తే వారి వివరాలు నమోదు చేసి తమకు సమాచారం అందించాలని నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి వ్యాపారులకు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జిల్లాలోని చక్కెర, బెల్లం డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. నాటుసారా తయారీని అరికట్టడానికి సహకరించాలని, పెద్ద ఎత్తున బెల్లం, చక్కెరలు కొనుగోలు చేసే వారిని గుర్తించి తమకు తెలియజేయాలని కోరారు. నాటుసారా తయారీదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం స్ఫూర్తిదాయకం

ఆళ్లగడ్డ: వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితాన్ని ప్రతి బాలిక ఆదర్శంగా తీసుకోవాలని ఎస్‌ఐ నగీన సూచించారు. మున్సిపల్ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం (మెయిన్) స్కూల్లో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడిన వీర వనిత అని కొనియాడారు. స్త్రీ శక్తికి ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తి అన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శారా విజయకుమారి, ఏపీ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు అమీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

చాగలమర్రి: క్యాన్సర్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఎన్‌సీడీసీ కార్యక్రమం ద్వారా వైద్యారోగ్య సిబ్బంది ఈ నెల 14వ తేదీ నుంచి మండలంలోని ఆయా గ్రామాలలో ఇంటింటిని సందర్శించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం చాగలమర్రిలో నిర్వహిస్తున్న క్యాన్సర్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. పరీక్షలను నిర్వహించి క్యాన్సర్ వ్యాధిని గుర్తించడంతో పాటు 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి నోటి క్యాన్సర్, మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ కాన్సర్ వ్యాధులపట్ల ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.అలాగే ఆహారపు అలవాట్లు, బీపీ, షుగర్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీంతో పాటు ప్రతి వ్యక్తి ఎత్తు, బరువు తదితర వివరాలను సేకరించి ఎన్‌సీడీసీ యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ తేజశ్విని, ఏఎన్ఎంలు ఉమాదేవి, మాధవి, ఆశ కార్యకర్తలు శివలక్ష్మి, సౌభాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.